వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 9 నుంచి, ఎంఈ/ఎంటెక్ (ఏఐసీటీఈ) కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండో సెమిస్టర్ పరీక్షలను వచ్చే నెల 10 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు..

అడ్డగుట్ట, జూన్ 27 : నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రజిత అన్నారు. అడ్డగుట్టలో అక్రమ నిర్మాణాన్ని, విజయపురి కాలనీలో రోడ్డు ఆక్రమణలను గురువారం టౌన్ ప్లానింగ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ...సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని.. ఇందులో భాగంగా అడ్డగుట్ట, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, తార్నాక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించి వెనువెంటనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూల్చివేతల్లో టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ సరితా, వార్డు టౌన్‌ప్లానర్స్ ప్రకాశ్, మానిక, చైన్‌మెన్‌లు నాగయ్య, అంజయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసానిని కలిసిన మల్లికార్జున్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్, జూన్ 27 : నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన హైస్కూల్ సాధన కమిటీ కన్వీనర్ ఇ.చంద్రశేఖర్, కో-కన్వీనర్లు నర్సింగ్‌రావు, శేషగిరిరావు, ఇటీవల బదిలీ అయిన హెడ్ మాస్టర్ కె.మల్లికార్జున్ రెడ్డిలు గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా హైస్కూల్ భవన నిర్మాణ ప్రగతిని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు కావడం, దాని ద్వారా పాఠశాలలో జరిగిన పనులను ఎమ్మెల్యేకు వివరించారు. పాఠశాల ఏర్పడిన నాటినుండి గత పదేండ్లుగా పాఠశాల అభివృద్ధికి, ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి విద్యాశాఖ ద్వారా రూ.రెండున్నర కోట్ల నిధులను మంజూరు చేయడానికి సహకారం అందించిన ఎమ్మెల్యే తలసానికి హెచ్ఎం మల్లికార్జున్‌రెడ్డి ధన్యవాదములు తెలిపారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసిన బోయిన్‌పల్లి బీఆర్ఎస్ యువ నాయకులు రాగిరి టింకు గౌడ్, తదితరులు – బొల్లారం,జూన్ 27

30న బోయినపల్లి మార్కెట్‌లో అన్నదానం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో మాట్లాడుతున్న బోయినపల్లి మార్కెట్ వెహికిల్స్, డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు

బేగంపేట్ జూన్ 27: బోయినపల్లి మార్కెట్ వర్తకులు కార్మికుల సంఘం మాజీ అధ్యక్షుడు తలసాని శంకర్‌యాదవ్ జ్ఞాపకార్థం ఈ నెల 30న బోయినల్లి మార్కెట్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మార్కెట్ వెహికిల్స్,డ్రైవర్స్,క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలో కలిసి అన్నదాన కార్యక్రమానికి ఆహ్వానించారు. తమకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా శంకర్‌యాదవ్ అండగా నిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేసేవారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. శంకర్‌యాదవ్ మృతి తమకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ...మీకు అన్ని విధాలుగా ఉండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి నర్సింహా, ఉపాధ్యక్షుడు జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నేతలు

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం మహంకాళి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బేగంపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశాల్ సుదం, తదితరులు కలిశారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్న మంత్రి పొన్నంకు ధన్యవాదాలు తెలిపారు. – బేగంపేట్

ఎమ్మెల్యే తలసానికి పరామర్శ..

మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే తలసాని సోదరుడు తలసాని శంకర్‌యాదవ్ విషయం తెలిసిందే. గురువారం ఎమ్మెల్యే కృష్ణారావు ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తలసానిని కలిసి పరామర్శించారు. ఆయన వెంట బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, తదితరులు ఉన్నారు. – మారేడ్‌పల్లి/ బేగంపేట్, జూన్ 27

నిత్యావసర సరుకుల పంపిణీ..

లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది నిరుపేద వికలాంగులు, దివ్యాంగుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను గురువారం దమ్మాయిగూడలో అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మనోజ్‌కుమార్, రామిరెడ్డి, సంతోశ్, వీణ సరస్వతి, రమేశ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ప్రవీణ్, అనిత పాల్గొన్నారు. –అడ్డగుట్ట, జూన్ 27

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

హిమాయత్‌నగర్, జూన్ 27: అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే సహించేంది లేదని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి అన్నారు. నారాయణగూడ జలమండలి జీఎం రామకృష్ణతో గురువారం సమావేశమయ్యారు. మురుగు, మంచినీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ కొద్దిరోజుల నుంచి పలు బస్తీల్లో మంచినీటి సమస్యతో పాటు మురుగు నీరు సరఫరా అవుతుందన్నారు. జలమండలి సిబ్బంది పనులు సక్రమంగా చేయడం లేదని, కాంట్రాక్టర్లు ప్యాచ్‌వర్క్ చేయకపోవడంతో రోడ్లని గుంతలుగా మారడంతో పాదచారులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. బస్తీలు, కాలనీలు, రోడ్లపక్కన వర్షం నీరు, డ్రైనేజీ నీరు నిల్వ ఉండకుండా, తాగునీటి సరఫరా ఆటంకం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ జలమండలి డీజీఎం సన్యాసీరావు, మేనేజర్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జి. రామన్‌గౌడ్, మహేశ్, జక్కి పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

ఘట్‌కేసర్,జూన్27: ఘట్‌కేసర్ నివాసి గడ్డం మహేశ్ హత్య కేసులో పోలీసులు గురువారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మహేష్ హత్యకు సహకరించిన శ్రీరాములు ,రాజు పరారీలో ఉన్నారు.వీరిద్దరు ఘట్‌కేసర్ పోలీస్టేషన్ సమీపంలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఉన్నట్లు పక్కా సమాచారాన్ని అందుకున్న పోలీసులు ఈనెల 26న అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.మహేశ్ హత్య కేసులో ప్రధాన నిదితులైన ప్రవీణ్,శ్రీనివాస్‌కు సహకరించినట్లుగా రాజు, శ్రీరాములు అంగీకరించారు.శ్రీరాములు నుంచి మృతుడు మహేశ్‌కు సంబంధించిన బంగారు గొలుసు,ఉంగరం,సెల్‌ఫోన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పాలకమండలి సభ్యులకు అభినందన

ఎర్రగడ్డ, జూన్ 27: ఎన్ఆర్ఆర్ పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పాలక మండలి ఎన్నికల్లో సెక్యులర్ ప్యానల్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ ప్యానల్ ప్రతినిధులు గురువారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిశారు. పాలక మండలి నూతన కార్యవర్గం అధ్యక్షుడు యూసుఫుద్దీన్, ఉపాధ్యక్షుడు చాట్ల ఈలయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమామ్‌గోరి, కోశాధికారి సత్యనారాయణ, బోర్డు సభ్యులు, తదితరులను ఎమ్మెల్యే అభినందించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి..

పెండింగ్ పనుల పూర్తి కోసం జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, జూన్ 27: సీతాఫల్‌మండి డివిజన్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కార్పొరేటర్ హేమ కోరారు. ఈ మేరకు గురువారం ఆమె.. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో సీనియర్ ఇంజినీర్ అనిల్ రాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పెండింగ్ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవా లని కోరారు. అలాగే డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర నగర్, మార్కండేయనగర్‌లో ఎన్నికల సందర్భంగా సీసీరోడ్ల ప్రతిపాదనలు రద్దు అయినందున వాటిని మళ్లీ రీటెండరింగ్ చేసి మంజూరు చేయాలని కోరారు. భవానీ నగర్, శాబాజ్‌గూడ, ఇంది రానగర్ కాలనీ , తదితర ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్లు మంజూరు చేసి త్వరగా పనులు మొదలు పెట్టాలని కోరారు. అలాగే ఇందిరా నగర్ స్ట్రాం వాటర్ కోసం బాక్స్ డ్రైన్ పనులను కోటి రెండు లక్షల వ్యయంతో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నేడు జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 27: నిరుద్యోగ యువతకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనా అధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనా కార్యాలయంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హత కల్గిన యువతీ యువకులకు జాబ్‌మేళాకు హాజరుకావాలని, వేతనం రూ.15వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల యువత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్ఐసీ.జీవోవీ.ఇన్. పోర్టల్‌లో రిజస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు 7386809422 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఒంటరి మహిళలు మనోధైర్యం కోల్పోకూడదు..

అడ్డగుట్ట, జూన్ 27 : ఒంటరి మహిళలు మనోధైర్యం కోల్పోకుండా సమాజంలో రాణించాలని పీఓడబ్ల్యూ సంధ్య అన్నారు. తుకారాంగేట్ బోయబస్తీ కమ్యూనిటీ హాల్ లో యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఒంటరి మహిళలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంధ్య మాట్లాడుతూ... మద్యానికి బానిసై మగవారు త్వరగా కాలం చేస్తున్నారని, తద్వారా చిన్నవయస్సులోనే ఆడవారు ఒంటరిగా మిగిలిపోతున్నారని అన్నారు. ఒంటరి మహిళలకు ప్రభుత్వం చొరవ తీసుకొని ఇల్లు, ఐదు వేల పెన్షన్‌ను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమన్ వేదిక అంబికా, యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం ఆఫీసర్ వందన, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలతో పీఓడబ్ల్యూ సంధ్య, యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు

పట్టాలు దాటుతుండగా ఢీకొట్టిన రైలు..

మారేడ్‌పల్లి, జూన్ 27: తిరుపతికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడిని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం ...నిజామాబాద్ ప్రాంతానికి చెందిన చెందిన ఎక్కెరల పెద్దరాజు (69) వ్యవసాయం పని చేస్తుంటాడు. కాగా..ఇంట్లో తిరుపతికి వెళ్లి వస్తానని చెప్పి గురువారం మౌలాలి-చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించా రు.

వ్యభిచారం చేయించిన వ్యక్తికి జైలు శిక్ష

మేడ్చల్, జూన్ 27: యువతి ఆర్థిక పరిస్థితులను ఆసరా చేసుకొని వ్యభిచారంలోకి దింపిన వ్యక్తికి న్యాయమూర్తి 9 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. మేడ్చల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి వివరాల ప్రకారం...నగరంలోకి టీఎస్ఐఐసీ కాలనీ జీడిమెట్లకు చెందిన వీరరాజు 2002లో ఓ యువతిని వ్యభిచారంలోకి దింపి, వ్యభిచారం గృహం నడిపించాడు. సమాచారంతో పోలీసులు దాడి చేయగా గృహంలో శ్రీకాంత్ అనే విటుడు పోలీసుల చేతికి చిక్కాడు. పోలీసులు వీరరాజు, శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి, విచారణ చేయగా బలవంతంగా వ్యభిచారంలోకి దింపాడని తేలడంతో మేడ్చల్ అసిస్టెంట్ సేషన్స్ న్యాయస్థానంలో హాజరు పర్చారు. గురువారం తుది విచారణ రాగా నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావడంతో వీరరాజుకు 9 ఏండ్ల జైలు శిక్ష, శ్రీకాంత్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మేడ్చల్ అసిస్టెంట సేషన్స్ న్యాయమూర్తి అజయ్‌యాదవ్ తీర్పు వెలువరించారు.

చంద్రశేఖర్‌రావుకు నంది పురస్కారం ప్రదానం

నంది పురస్కారాన్ని అందుకుంటున్న చంద్రశేఖర్ రావు

అడ్డగుట్ట, జూన్ 27 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబురాలను పురస్కరించుకొని వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురికి నంది పురస్కారాలను అందజేయడం జరిగింది. ఇందులో చిలకలగూడ ప్రాంతానికి చెందిన ఎంసీఆర్ ప్రజాసేవ వ్యవస్థాపక అధ్యక్షుడు మ్యాకల చంద్రశేఖరరావుకు నంది పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారిల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం చిలకలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ.... గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించి తనకు పురస్కారాన్ని అందించారని తెలిపారు. రానున్నకాలంలో సేవ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని ఆయన అన్నారు.

ఎరువుల కేంద్రాన్ని సందర్శించిన చైర్‌పర్సన్

మణికొండ, జూన్ 27: ప్రజలు తమ ఇంట్లో చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి అందించడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉంటాయని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. వట్టినాగులపల్లిలో డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తతో తయారు చేసే సేంద్రియ ఎరువు కేంద్రాన్ని గురువారం కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్, డీఈ నర్సింహ్మరాజుతో కలిసి పరిశీలించారు. కేంద్రంలో తడి చెత్తతో తయారు చేసే వాటిని అడిగి తెలుసుకున్నారు. అది ఎన్ని రోజులకు ఎరువుగా మారుతుదనే విషయాన్ని సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. పొడి చెత్తను వేరు చేసిన మెటీరియల్స్‌తో సెగ్రిగేషన్ చేసే విధానాలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఎరువుల తయారీ ద్వారా చెట్లను పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడుందన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ చెత్తను వేర్వేరుగా తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎరువుల తయారీలో ఆసక్తి ఉన్న ప్రజలకు సైతం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తద్వారా తమ ఇంటి వద్దే ఎరువులను తయారు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమాత రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



కంటోన్మెంట్ ఒకటో వార్డు, న్యూ బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్‌లోని శ్రీ మాత రేణుక ఎల్లమ్మ దేవాలయం 5వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి , తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, విజయ్, ఎల్లస్వామి, దయానంద్, మహేందర్, జయమ్మ, సుశీల, తదితరులు పాల్గొన్నారు. – బొల్లారం, జూన్ 27

మత్తు పదార్థాలు అమ్ముతున్న ముగ్గురి అరెస్టు

ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న ముగ్గురు నిందితులు

మల్కాజిగిరి, జూన్ 27: మత్తు పదార్థాలు (ఎండీఎంఏ)అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసులు మల్కాజిగిరి అనుటెక్స్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. అటుగా వచ్చిన వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా వారి వద్ద 4గ్రాముల ఎండీఎం స్ఫటిక రూపంలో ఉన్న తెల్లని ఫౌడర్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరు బెంగళూర్ నుంచి తీసుకొచ్చి కొంత వీరు వినియోగించుకుని మిగిలింది అమ్ముతున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని సికింద్రాబాద్ మెట్టుగూడకు చెందిన సెబాస్టిన్ ఆంథోని, మల్కాజిగిరి పీవీఎన్ కాలనీకి చెందిన రాకేష్‌కుమార్, భాసుప్రసాదలను అరెస్టుచేసి రిమాండుకు తరలించారు.

విడాకులిచ్చినా..ఆగని వేధింపులు

జవహర్‌నగర్, జూన్ 27: ప్రేమించి పెండ్లి చేసుకున్నారు... వేధింపులతో వేగలేక విడాకులు తీసుకుంది... అయినా మొదటి భర్త మెసేజ్‌బాంబర్‌యాప్‌తో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. రెండో వివాహం చేసుకుని సజావుగా సాగుతున్న సంసారంలో మొదటి భర్త బెదిరింపులకు పాల్పడటంతో మహిళ అతనిపై జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. బాధితురాలి కథనం ప్రకారం... దమ్మాయిగూడ శ్రీయుగ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న గాలి హరిచందన(42) తన రెండో భర్త మనవ్యాల్ మత్తేటితో కలిసి ఉంటుంది. 2011లోనే అరుణ్ కుమార్ గైక్వాడ్‌తో హరిచందన ప్రేమ వివాహం చేసుకుంది. అప్పట్లో హరిచందనను తనమొదటి భర్త హింసిస్తుంటడంతో అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. 2012లో బాబు పుట్టినా పట్టించుకోకపోవడంతో పాటు వేధింపులకు గురిచేయడంతో 2013లో కోర్టు నుంచి విడాకులు కూడా తీసుకుంది. 2015 లో మరో వివాహం చేసుకుంది. అయినప్పటికీ మొదటి భర్త మెసేజ్‌లు పలు యాప్‌లతో పాటు రెండో భర్త కుటుంబసభ్యులపై అసభ్య పదజాలంతో మెసేజ్‌లు చేస్తూ ఆన్‌లైన్ నుంచి కాల్స్‌చేస్తూ బెదిరింపులకు గురిచేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయడం తో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా బొజ్జా తారకం జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 27: అణగారిన వర్గాల కోసం నిరంతరం పోరాడిన బొజ్జా తారకం 85వ జయంతిని ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆల్ మాలా స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో తారకం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నామ సైదులు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధన కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా, గొప్ప న్యాయవాదిగా, కవిగా, రచయితగా సేవలందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎన్ఎం శ్రీకాంత్‌యాదవ్, చంద్రశేఖర్, భూతం రఘు, సాయి, నగేశ్, గోపి, కార్తిక్, సదానందం, తరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బొజ్జా తారకంకు నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

చేయూత ఇవ్వాలి..

హిమాయత్‌నగర్, జూన్ 27: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు చేయూత నివ్వాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి కోరారు. పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదర్‌గూడలోని ప్రభుత్వ స్కూల్‌లో చదివే విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

శుభాకాంక్షలు...



తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్‌గా నియమితులైన ప్రియాంకను తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం గౌరవ అధ్యక్షుడు కైరంకొండ యాదగిరి, రాష్ట్ర గంగపుత్ర ఐక్య కార్యచరణ సమితి చైర్మన్ దీటి మల్లయ్యలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి పాక మధుసూదన్, కార్యదర్శి రాజేశ్ ఖన్నాలు పాల్గొన్నారు. – అడ్డగుట్ట, జూన్ 27